# ది లాటరీ

## షర్లీ జాక్సన్

అనువాదం: ఎ.వి. రమణమూర్తి



*జూన్ 27 ఉదయం.*

*వెచ్చటి వేసవి ఉదయం. రంగురంగుల పూలూ, పచ్చగా పరుచుకుని ఉన్న ఆకుపచ్చని గడ్డి. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.*

ఆ ఊళ్లో ఉన్న జనాలు పదిగంటలకల్లా బాంక్‌కీ, పోస్ట్ ఆఫీస్‌కీ మధ్యనున్న ఖాళీ ప్రదేశానికి రావడం మొదలుపెట్టారు. పక్కనున్న పెద్ద ఊళ్లల్లో అయితే ఈ లాటరీ రెండురోజులు పాటు జరుగుతుంది కానీ, ఈ ఊరి జనాభా సుమారు మూడువందలే కాబట్టి, లాటరీ మొత్తం ఓ రెండు గంటల్లో అయిపోతుంది. పదిగంటలకల్లా లాటరీ మొదలయితే, మధ్యాహ్నం భోజనాల వేళకి అందరూ ఇళ్లకి వెళ్లిపోవచ్చు!

ముందుగా పిల్లలు రావడం ప్రారంభించారు. ఇటీవలే స్కూళ్లకు సెలవులిచ్చారు కానీ వాళ్లు ఆ స్వేచ్ఛకి ఇంకా పూర్తిగా అలవాటు పడినట్టుగా లేరు. ఒక్కొక్కరూ నిశ్శబ్దంగా చేరుకున్న కాసేపట్లోనే హడావుడీ, గోలగోలా. ఈలోగా బాబీ మార్టిన్ చడీచప్పుడు లేకుండా తన జేబుల్లో రాళ్లు కుక్కుకున్నాడు. అది గమనించిన మిగతా పిల్లలు కూడా చక్కగా గుండ్రంగా నున్నగా ఉన్న రాళ్లని సేకరించుకోవడం మొదలుపెట్టారు. బాబీ మార్టిన్, హారీ జోన్స్, డికీ డెలక్రాయ్ కాసేపట్లోనే ఓ మూలగా పెద్ద రాళ్లగుట్ట పోగేసారు. ఆడపిల్లలు మాత్రం ఓ పక్కగా నుంచుని, వాళ్లల్లో వాళ్లు మాట్లాడుకుంటూ, అప్పుడప్పుడూ అబ్బాయిలు చేస్తున్నది దొంగచూపుల్తో గమనిస్తూ ఉన్నారు.

ఇంతలో ఊరిలోని మగవాళ్లు రావడం ప్రారంభించారు– వాళ్ల వాళ్ల పిల్లలు ఎక్కడున్నారో గమనించుకుంటూ; పంటలు, వానలూ, ట్రాక్టర్లూ, పన్నులూ ఇలాంటి విషయాలు మాట్లాడుకుంటూ. ఆ ఖాళీ ప్రదేశంలో రాళ్లగుట్టకి దూరంగా ఓచోట అందరూ కలిసి నించున్నారు. క్రమంగా వాళ్ల చెణుకుల, నవ్వుల శబ్దం, చిరునవ్వుల నిశ్శబ్దంలోకి జారిపోతూ ఉంది. ఆ తర్వాత ఆడవాళ్లు —ఇళ్లలో వేసుకునే మామూలు వెలిసిపోయిన బట్టలతో — రాసాగారు. ఒకరినొకరు పలకరించుకుని, కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకుని, వాళ్ల వాళ్ల భర్తల దగ్గరికి వెళ్లి నుంచుని, పిల్లల్ని పిలవసాగారు. నాలుగైదుసార్లు పిలిచాక పిల్లలు అయిష్టంగా వచ్చారు. బాబీ మార్టిన్ వాళ్ల అమ్మ దగ్గరకి వచ్చినట్టే వచ్చి, వాళ్ల అమ్మ చేతినుంచి తప్పించుకుని అల్లరిగా నవ్వుతూ మళ్లీ రాళ్లగుట్ట దగ్గరకి పరిగెత్తసాగాడు. వాళ్ల నాన్న ఒక్క అరుపు అరిచాడో లేదో, కిక్కురుమనకుండా వచ్చి, నాన్న అన్నయ్యల మధ్య నుంచున్నాడు.

ఈ లాటరీని నిర్వహించేది మిస్టర్ సమ్మర్స్. సరదాగా ఉండే సమ్మర్స్ ఊళ్లో బొగ్గు కంపెనీ నడుపుతూ ఉంటాడు. సంపన్నుడే కానీ, ఇలాంటి సామాజిక కార్యక్రమాలకి సమయమూ, శక్తీ కేటాయిస్తుంటాడు. జనాలకి ఆయనంటే సానుభూతి. పిల్లలు లేరు, భార్యేమో గయ్యాళి. ఒక నల్లపెట్టె పట్టుకుని సమ్మర్స్ అక్కడికి చేరుకోగానే

అక్కడి జనాల్లో చిన్న కలకలం, గుసగుసలూ. ఆ వెనుకే ఆ ఊరి పోస్ట్‌మాస్టర్ — మిస్టర్ గ్రేవ్స్ — ఓ ముక్కాలి పీటతో వచ్చి, ఆ ముక్కాలి పీటని ఖాళీ ప్రదేశం మధ్యగా పెట్టగా, సమ్మర్స్ తన చేతిలో ఉన్న నల్లపెట్టెని ఆ ముక్కాలి పీటమీద ఉంచాడు. గ్రామస్తులు ఆ ముక్కాలి పీటకి కొంచెం ఎడంగా నిలుచున్నారు. "ఎవరన్నా ముందుకొచ్చి కొంచెం సహాయం చేస్తారా?" అనగానే, స్వల్ప సందేహాత్మక విరామం తర్వాత మార్టిన్, అతని పెద్దకొడుకు బాక్స్టర్ ముందుకొచ్చి, ఆ నల్లపెట్టెని కదలకుండా చెరోవైపూ పట్టుకున్నారు.

అసలు ఈ లాటరీకి కావలసిన సామాగ్రీ, సరంజామా అంతా ఎప్పుడో పోయింది. ఇప్పుడున్న ఈ నల్లపెట్టె కూడా ఎప్పటిది? ఆ ఊళ్లోని అతి పెద్ద వృద్ధుడు వార్నర్ కూడా పుట్టకముందు కాలం నాటిది. ఈ పెట్టెని కూడా, అంతకుముందు కొన్నితరాలకి ముందు వాడిన పెట్టె తాలూకు ముక్కలతోనే తయారుచేసారని చెప్పుకుంటూంటారు. ఆ పెట్టె మారుద్దామని సమ్మర్స్ ఎన్నిసార్లు అన్నా, మిగిలివున్న ఆ మాత్రం సంప్రదాయపు అవశేషాన్ని పోగొట్టుకోవడానికి గ్రామస్తులెవరూ ఇష్టపడలేదు. రంగులు వెలిసిపోయి, ఓ పక్క విరిగిపోయినట్టుగా ఉన్న ఆ నల్లపెట్టె, చెక్క లోపలి రంగుని సైతం బహిరంగపరుస్తూ, చాలా దీనావస్థలో ఉంది.

మార్టిన్, అతని కొడుకూ పెట్టెని కదలకుండా పట్టుకుని ఉండగా, సమ్మర్స్ లోపల ఉన్న చీటీలని ఓసారి కలిపేసాడు. సంప్రదాయాన్ని గౌరవించే విషయంలో గ్రామస్తులు పూర్తిగా కాకపోయినా కొంతవరకూ రాజీపడగలరు కాబట్టి ఇంతకు ముందు చీటీల స్థానంలో ఉన్న చెక్కముక్కలని సమ్మర్స్ వదిలించగలిగాడు. ఊళ్లో జనాభా పెరుగుతూ ఉన్న కారణంగా, చెక్కముక్కలతో అయితే పెట్టె సరిపోదని వాదించి సమ్మర్స్ కాగితపు చీటీల వాడకానికి గ్రామస్తులని ఒప్పించగలిగాడు. లాటరీ ముందురోజున సమ్మర్స్, పోస్ట్‌మాస్టర్ గ్రేవ్స్ కలిసి చీటీలని తయారుచేసి ఆ పెట్టెలో వేసి, ఆ పెట్టెని సమ్మర్స్ బొగ్గు కంపెనీ ఆఫీస్‌లో భద్రపరుస్తూ ఉంటారు. మిగిలిన కాలమంతా అది ఎక్కడో అక్కడ ఉంటుంది. గ్రేవ్స్ కొట్టంలో ఓ సంవత్సరం, పోస్ట్ ఆఫీస్‌లో ఓ సంవత్సరం, మార్టిన్ కిరాణా కొట్లో ఓ సంవత్సరం- ఇలా.

లాటరీ ప్రారంభం అయిందని సమ్మర్స్ ప్రకటించడానికి ముందు చాలా తంతు ఉంటుంది. కుటుంబ పెద్దల పేర్లతో ఒక లిస్టూ, ఒక్కో కుటుంబంలోని సభ్యులతో మరో లిస్టూ తయారుచేయాలి. ఈ లాటరీ నిర్వహించే వ్యక్తిగా సమ్మర్స్ చేత పోస్ట్‌మాస్టర్ గ్రేవ్స్ ప్రమాణస్వీకారం చేయించాలి. ఒకప్పుడయితే లాటరీకి ముందు ఒకలాంటి ప్రార్థన కూడా చేయడం ఆ గ్రామస్తులకి లీలగా గుర్తు. లాటరీ తీయడానికి వచ్చిన వ్యక్తితో సెల్యూట్ చేయడం లాంటివి కూడా ఒకప్పుడు ఉండేవి కానీ, ఇప్పుడు సమ్మర్స్ అతనిని పలకరించడంతో సరిపెడుతున్నారు. ఈ విధివిధానాలలో సమ్మర్స్ నిష్ణాతుడు. తెల్లటి చొక్కా, బ్లూ జీన్స్ ధరించి ఓ చేయిని అలా నిర్లక్ష్యంగా నల్లపెట్టె మీద పెట్టి, గ్రేవ్స్ తోనూ మార్టిన్స్ తోనూ మాట్లాడుతూ కనిపించే సమ్మర్స్ చాలా హుందాగా, ముఖ్యమైన వ్యక్తిలా అనిపిస్తాడు చూడగానే.

అంతా సిద్ధం అనుకుని, సమ్మర్స్ ఇక గ్రామస్తుల వైపు తిరుగుతూ ఉండగా మిసెస్ హచిన్‌సన్ హడావుడిగా వచ్చి గుంపు వెనకాల నిలుచుంది. ఆవిడ స్వెటర్ భుజం మీద లూజ్‌గా వేలాడుతూ ఉంది. "అదేవిటో, బొత్తిగా మర్చిపోయాను ఇవాళ లాటరీ అని..." అంది పక్కనే ఉన్న మిసెస్ డెలక్రాయ్‌తో. ఇద్దరూ నిశ్శబ్దంగా నవ్వుకున్నారు. "మా ఆయన కట్టెలు కొడుతూ దొడ్లో ఉన్నారేమో అనుకున్నాను. తీరా చూస్తే పిల్లలూ లేరు, ఆయనా లేరు. అప్పుడు గుర్తొచ్చింది ఇవాళ ఇరవై ఏడు అని. ఒక్క ఉదుటున పరిగెత్తుకుంటూ వచ్చేసాను," అంది, తన తడిచేతులు వంటిమీదున్న ఏప్రన్‌కి తుడుచుకుంటూ. "పర్లేదు, టైముకే వచ్చేసావు," అంది మిసెస్ డెలక్రాయ్.

ఈలోపల తలకొంచెం సారించి, తనవాళ్లంతా ఎక్కడ నిలుచుని ఉన్నారో చూసుకుని, 'వెళ్లొస్తాను...' అన్నట్టుగా మిసెస్ డెలక్రాయ్ చేతిమీద చిన్నగా తట్టి, తనవాళ్ల వైపు గుంపులో తోవ చేసుకుంటూ వెళ్లిపోయింది మిసెస్ హచిన్‌సన్. జనాలు కూడా విసుక్కోకుండా ఆవిడకి దారి

ఇస్తూ, "బిల్, మొత్తానికి మీ ఆవిడ వచ్చేసిందయ్యా..." అన్నారు ఇద్దరు ముగ్గురు పెద్దగానే, అందరికీ వినిపించేలా. "నువ్వు రాకుండానే మొదలుపెట్టేయాల్సి వస్తుందేమో అనుకున్నాను టెస్సీ," అన్నాడు అప్పటివరకూ వేచిచూస్తున్న సమ్మర్స్ సరదాగా మిసెస్ హచిన్‌సన్‌తో. "సింక్‌లో గిన్నెలన్నీ అలానే వదిలేసి రాగలనా, జో?" అంది ఆవిడ నవ్వుతూ సమ్మర్స్‌తో. ఓ సన్నటి నవ్వు గుంపు మొత్తం పరుచుకుంది. అందరూ సర్దుకుని నిలుచున్నారు.

"అందరూ వచ్చేసినట్టేనా? తొందరగా మొదలుపెట్టి, తొందరగా ముగించేస్తే, మనం మన పనులకి వెళ్ళిపోవచ్చు," అన్నాడు సమ్మర్స్.

"డన్‌బర్... డన్‌బర్..." అని వినిపించింది గుంపులోనుంచి. సమ్మర్స్ తన లిస్ట్ చూసుకుని, "అవును.. క్లైడ్ డన్‌బర్స్. కానీ అతని కాలు విరిగింది కదా? అతని బదులు ఎవరు లాటరీ తీస్తున్నారు?" అన్నాడు.

"నేను...?" అంది ఒకావిడ. ఆ జవాబు వచ్చినవైపుగా చూస్తూ "భర్తకి బదులు భార్య అన్నమాట," అన్నాడు సమ్మర్స్. "ఎదిగిన అబ్బాయి ఎవరూ లేరా జేనీ?" అని అడిగాడు. ఆ ప్రశ్నకి సమాధానం సమ్మర్స్‌తో సహా అక్కడ ఉన్న అందరికీ తెలిసినప్పటికీ, అలా అడగడం విధాయకం. సమాధానం కోసం సమ్మర్స్ కాసేపు ఎదురుచూసాక, "హొరేస్‌కి ఇంకా పదహారు నిండలేదు," అంది మిసెస్ డన్‌బర్. "ఈసారికి మా ఆయన బదులు నేనే తీయాలేమో..." అని కూడా అంది. "రైట్," అని తన లిస్ట్‌లో నోట్ చేసుకున్నాడు సమ్మర్స్.

"వాట్సన్ వాళ్ల అబ్బాయి ఈసారి లాటరీ తీస్తున్నట్టేనా?" అని అడిగాడు గుంపునుద్దేశించి.

పొడుగ్గా ఉన్న ఒక అబ్బాయి చెయ్యి పైకెత్తి, "ఇక్కడ..." అన్నాడు. గుంపు అతనివైపు ప్రశంసాపూర్వకంగా చూసింది. "జాక్ మంచి పిల్లవాడు. కుటుంబానికి ఒక మగదిక్కుగా నిలబడుతున్నాడు," అని వాళ్లు అభినందిస్తూ ఉండగా, ఇబ్బందిగా కళ్లు తాటించి తలదించుకున్నాడు ఆ అబ్బాయి జాక్.

"వెల్, ఇప్పుడు అందరూ ఉన్నారనే అనుకుంటున్నాను. పెద్దాయన వార్నర్ వచ్చేసినట్టేనా?" అని అడిగాడు సమ్మర్స్.

"ఇక్కడ," అంది ఓ గొంతు. వార్నర్ ఆ ఊళ్లో అందరికంటే వయసులో పెద్దవాడు.

★★

సమ్మర్స్ గొంతు సవరించుకోగానే అక్కడ వెంటనే నిశ్శబ్దం అలుముకుంది. "అంతా రడీ కదా!? ఇప్పుడు ముందు కుటుంబపెద్దల పేర్లు పిలుస్తాను. పిలవగానే ఆ మగవాళ్లు వచ్చి, ఈ పెట్టెలోనుంచి ఒక పేపర్ తీసుకోవాలి. తీసుకున్నాక, దాన్ని మడతలు పెట్టేసి చేతిలో దాచిపెట్టేసి ఉంచండి. అందరి వంతూ అయ్యేదాకా వాటిని తెరవద్దు. అర్థమైంది కదా?" అని అడిగాడు సమ్మర్స్.

ఈ తతంగం అంతా చాలాసార్లు చూసేసి ఉన్న జనం, అతను చెప్పింది వినీవిననట్టు ఉన్నారు. చాలామంది నిశ్శబ్దంగా ఉన్నారు– పెదాలు తడుపుకుంటూ, పక్కకి కూడా తిరిగి చూడకుండా. సమ్మర్స్ చేయి పైకెత్తి, "ఆడమ్స్!" అని పిలిచాడు. గుంపునుంచి ఒక మనిషి ముందుకొచ్చాడు. "హాయ్ స్టీవ్," అన్నాడు సమ్మర్స్. "హాయ్ జో," అన్నాడు ఆడమ్స్. ఇద్దరూ ఓ ఇబ్బంది పొడినవ్వు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆడమ్స్ పెట్టెలోనుంచి మడతపెట్టి ఉన్న ఒక చీటీ తీసుకుని, గబగబా వెనక్కి వెళ్లిపోయి, తన కుటుంబానికి కొద్ది దూరంలో నిలుచున్నాడు– తన చేతివైపు అస్సలు చూసుకోకుండా. "ఆలెన్," తరువాతి పేరు పిలిచాడు సమ్మర్స్.

"లాటరీల మధ్య అసలు వ్యవధి ఉన్నట్టు అనిపించడం లేదు. నిరుటి లాటరీ మొన్న మొన్న జరిగినట్టు ఉంది," అంది మిసెస్ డెలక్రాయ్, మిసెస్ గ్రేవ్స్‌తో. "అవును, కాలం చాలా తొందరగా పరిగెడుతోంది," అంది మిసెస్ గ్రేవ్స్.

"క్లార్క్... డెలక్రాయ్," తరువాతి పేరు పిలిచాడు సమ్మర్స్.

"అదిగో! మా ఆయన వెళుతున్నాడు," అంది మిసెస్ డెలక్రాయ్. అతను పెట్టె దగ్గరికి వెళుతున్నప్పుడు ఆవిడ ఊపిరి బిగబట్టింది.

“డన్‌బర్...” పిలిచాడు సమ్మర్స్. “వెళ్లు జేనీ,” అంది ఒకావిడ. “అదిగో, వెళుతోంది,” అంది మరొకావిడ.

“తర్వాత మాదే,” అంది మిసెస్ గ్రేవ్స్. నల్లపెట్టె పక్కనే ఉన్న మిస్టర్ గ్రేవ్స్ పెట్టె ముందుకొచ్చి, గంభీరంగా ఒక చీటీని పెట్టెలోనుంచి తీసుకున్నాడు. చీటీలు తీసుకున్న వాళ్ల చేతిలో ఆ చీటీలు ఇబ్బందిగా కదులుతూ ఉన్నాయి. మిసెస్ డన్‌బర్ తన ఇద్దరు మగపిల్లలతో నిలుచుని వుంది, చేతిలో చీటీతో.

“హచిన్‌సన్.”

“అదిగో.. వెళ్లు, బిల్!” అంది మిసెస్ హచిన్‌సన్. ఆవిడ పక్కన ఉన్నవాళ్లు నవ్వారు.

“జోన్స్.”

“ఉత్తరపు వైపున పల్లెల్లో ఈ లాటరీ మానేద్దామని ఆలోచిస్తున్నారట,” అన్నాడు మిస్టర్ ఆడమ్స్ తన పక్కన ఉన్న ముసలాయన వార్నర్‌తో. వార్నర్ నిరసనగా హుంకరించాడు. “మూర్ఖులు. చిన్నవాళ్ల మాటలు వినడం మొదలుపెడితే ఇహ జరిగినట్టే. ఆ తర్వాత, ఆదిమ మానవుల్లాగా గుహల్లోకి వెళ్లిపోదామనీ, ఏ పనీ చేయక్కర్లేదని కూడా చెబుతారు. ఓ సామెత ఉంది విన్నావా? ‘జూన్‌లో లాటరీ ఉంటే, రానున్నది లాభాల పంటే’ అని. లాటరీ అనేది ఎప్పటినుంచో ఉంది,” అన్నాడు. “జో సమ్మర్స్ అలా అందరితో సరదాగా మాట్లాడటం కూడా నాకు నచ్చలేదు,” అన్నాడు కొనసాగింపుగా.

“కొన్నిచోట్ల లాటరీలని పూర్తిగా ఆపేసారట...” అంది మిసెస్ ఆడమ్స్.

“ప్రమాదం. ప్రమాదం తప్ప మరోటి కాదు,” అన్నాడు వార్నర్ మొండిగా. “కుర్రాళ్లు మూర్ఖంగా ఉంటున్నారు.”

“మార్టిన్!” పిలిచాడు సమ్మర్స్. బాబీ మార్టిన్ తన తండ్రి చీటీ తీయడం కోసం వెళ్లడం గమనిస్తూ ఉన్నాడు.

“ఓవర్‌డైక్... పెర్సీ!”

“వీళ్లు దీన్ని తొందరగా పూర్తి చేస్తే బావుణ్ణు,” అంది మిసెస్ డన్‌బర్ కొడుకుతో. “దాదాపు పూర్తయినట్టుంది,” అన్నాడు కొడుకు. “పరిగెత్తుకెళ్లి నాన్నకి చెప్పటానికి రడీగా ఉండు,” అంది ఆవిడ కొడుకుతో.

సమ్మర్స్ తన పేరుని తనే పిలుచుకొని, ముందుకొచ్చి పెట్టెలోనుంచి ఒక చీటీ తీసుకున్నాడు. “వార్నర్!” అని పిలిచాడు.

“ఈ లాటరీలలో పాల్గొనడం డెబ్బై యేడో సారి నాకు. డెబ్బై యేడు!” అన్నాడు వృద్ధ వార్నర్, చీటీ తీసుకొని తిరిగొస్తూ.

“వాట్సన్!” పొడుగ్గా ఉండే ఆ అబ్బాయి గుంపులోనుంచి బయటికి వచ్చాడు. “ధైర్యంగా తీయ్ జాక్,” అన్నాడు గుంపులోనుంచి ఒకరు. “నిదానంగా తీయి అబ్బాయ్,” అన్నాడు సమ్మర్స్.

“జనీని!”

★★

నిశ్శబ్దం. ఎవరి ఊపిరి వినిపిస్తున్న ఆనవాళ్లు కూడా లేని నిశ్శబ్దం.

తన చీటీని గాలిలో ఎత్తిపట్టుకుని, “ఆల్ రైట్, అందరూ...” అన్నాడు సమ్మర్స్. ఓ నిమిషం పాటు అందరూ స్తబ్దుగా ఉండిపోయారు. ఆ తర్వాతే ఒక్కరొక్కరూ చీటీలు తెరవడం ప్రారంభించారు. ఉన్నట్టుండి, ఆడవాళ్ల గొంతులు కలగాపులగంగా వినిపించడం ప్రారంభం కాసాగింది. “ఎవరు?,” “ఎవరికి వచ్చింది?,” “డన్‌బర్ ఫామిలీనా?,” “వాట్‌సన్సా?” ఈ కలవరపు కలకలంలోనుంచి అప్పుడు వినిపించింది. “అది హచిన్‌సన్ కుటుంబం. బిల్. బిల్ హచిన్‌సన్‌కి వచ్చింది.”

“వెళ్లి నాన్నకి చెప్పిరా,” అంది మిసెస్ డన్‌బర్ కొడుకుతో.

హచిన్‌సన్ కుటుంబం వైపు అందరూ తిరిగారు. బిల్ హచిన్‌సన్ తన చేతిలోని చీటీ వైపు చూస్తూ మాట్లాడకుండా నిలబడి ఉన్నాడు. అంతలో టెస్సీ హచిన్‌సన్, సమ్మర్స్ వైపు తిరిగి అరవడం వినిపించింది.

"మీరు ఆయనకి కావలసిన చీటీ తీసుకునేంత వ్యవధి ఇవ్వలేదు. నేను చూస్తూనే ఉన్నాను. ఇది న్యాయం కాదు!"

"ఊరుకో టెస్సీ," అంది మిసెస్ డెలక్రాయ్. "అందరికీ దొరికింది సమానావకాశమే కదా!" అంది మిసెస్ గ్రేవ్స్.

"నువ్వు నోరుమూసుకో, టెస్సీ," అన్నాడు భర్త బిల్ హచిన్‌సన్.

"అందరూ.. ఇటు చూడండి," అన్నాడు సమ్మర్స్. "ఇప్పటివరకూ త్వరత్వరగా అయింది. టైమ్‌కి పూర్తవ్వాలంటే మనం ఇంకొంచెం తొందరగా చేయాలి," అన్నాడు. "బిల్! మీ కుటుంబం తరఫున నువ్వు చీటీ తీయాలి. మీకు మరేమైనా ఉపకుటుంబాలు ఉన్నాయా?" అని అడిగాడు సమ్మర్స్.

"డాన్, ఇవా ఉన్నారు కదా!" అంది మిసెస్ హచిన్‌సన్. "వాళ్లకీ ఒక అవకాశం ఇవ్వండి."

"కూతుళ్లు వాళ్ల భర్తల కుటుంబాలతో కలిసి లాటరీలో పాల్గొంటారు, టెస్సీ! ఆ విషయం నీతో సహా ఇక్కడున్న అందరికీ తెలుసు," అన్నాడు సమ్మర్స్.

"ఇది న్యాయం కాదు," అంది టెస్సీ.

"వదిలేసెయ్, సమ్మర్స్!" బిల్ హచిన్‌సన్ కొంచెం విచారంగా అన్నాడు. "మా అమ్మాయి తన భర్తతో కలిసి లాటరీలో పాల్గొనడమే న్యాయం. నాకు నా పిల్లలు తప్ప వేరే ఫామిలీ ఏదీ లేదు..."

"ఓకే, ఎంతమంది పిల్లలు బిల్?" అడిగాడు మిస్టర్ సమ్మర్స్.

"ముగ్గురు. బిల్ జూనియర్, నాన్సీ, డేవ్. ఇంకా– టెస్సీ, నేను."

"అందరి దగ్గరా చీటీలు వెనక్కి తీసేసుకున్నావా, హేరీ?" సమ్మర్స్ అడిగాడు. మిస్టర్ గ్రేవ్స్ తలూపాడు.

"అసలు మనం దీన్ని మొదటినుంచీ ప్రారంభించాలి," మిసెస్ హచిన్‌సన్ సాధ్యమైనంత శాంతంగా అంది. "ఇది న్యాయం కాదని అంటున్నాను. బిల్‌కి మీరు తగినంత సమయం ఇవ్వలేదు. అందరూ చూసారు అది."

ఐదు చీటీలు మాత్రం పెట్టెలో వేసి, మిగతావన్నీ కింద పడేసాడు మిస్టర్ గ్రేవ్స్. గాలికి అవన్నీ ఎక్కడికో ఎగిరిపోయాయి.

"అందరూ, ప్లీజ్, వినండి," టెస్సీ తన చుట్టూ ఉన్నవాళ్లకి ఏదో చెప్పడానికి ఉద్యుక్తురాలైంది.

"రడీనా, బిల్?" అడిగాడు సమ్మర్స్. తన భార్యనీ, పిల్లల్నీ ఒక్కసారి చూసుకున్న బిల్ తల ఊపాడు.

"మళ్లీ వినండి.. చీటీ తీసుకుని, మడతలు విప్పకుండా మీదగ్గరే ఉంచుకోండి. హారీ, డేవ్ చిన్నపిల్లాడు. అతనికి కొద్దిగా హెల్ప్ చేయండి," అన్నాడు సమ్మర్స్. ఉత్సాహంగా పెట్టెదాకా వచ్చిన పిల్లాడి చేయి అందుకున్నాడు మిస్టర్ గ్రేవ్స్. "పెట్టెలోనుంచి ఒక చీటీ తీసుకో, డేవ్!" అన్నాడు సమ్మర్స్. డేవ్ పెట్టెలో చేయి పెట్టి కిసుక్కున నవ్వాడు. "ఒక్కటే చీటీ తీయాలి, డేవ్! హేరీ, పిల్లాడి తరఫున నువ్వు అతను తీసిన చీటీని పట్టుకో," అన్నాడు సమ్మర్స్. బలంగా మూసుకుని ఉన్న ఆ పిల్లవాడి గుప్పిట్లోంచి ఆ చీటీని తీసుకుని నిలుచున్నాడు మిస్టర్ గ్రేవ్స్. అతనిపక్కనే అతన్నే అబ్బురంగా చూస్తూ నిలబడ్డాడు డేవ్.

"నెక్స్ట్, నాన్సీ!" అన్నాడు సమ్మర్స్. పన్నెండేళ్ల ఆ అమ్మాయి ముందుకి వస్తుంటే, తన స్కూల్ ఫ్రెండ్స్ బలంగా ఊపిరితీసుకున్నారు. ఆ అమ్మాయి జాగ్రత్తగా ఒక చీటీ తీసింది. "బిల్ జూనియర్!" పిలిచాడు సమ్మర్స్. ఎర్రగా కందిపోయిన మొహంతో వచ్చిన అతను, చీటీ తీస్తున్నప్పుడు పెట్టె కింద పడినంత పనయింది. "టెస్సీ!" సమ్మర్స్ పిలిచాడు. ఒక్క క్షణం సందేహించిన టెస్సీ, అయిష్టంగా, పెదాలు బిగబట్టుకుని వచ్చి ఒక చీటీ తీసి, తన వెనుకగా పట్టుకుంది.

"బిల్!" పిలిచాడు సమ్మర్స్. బిల్ హచిన్‌సన్ పెట్టెలోపల చేయి పెట్టి కాసేపు పెట్టెలో వెతికి, చివరికి చీటీ తీసాడు.

గుమికూడిన వాళ్లు నిశ్శబ్దంగా ఉన్నారు. "నాన్సీ కాకూడదు ..." అని ఒక అమ్మాయి గుసగుసగా అంది. ఆ నిశ్శబ్దంలో ఆ గుసగుస, గుంపు అంచుల వరకూ వినిపించింది.

"ప్చ్.. ఇదంతా ఇంతకుముందులాగా లేదు," వృద్ధ వార్నర్ స్పష్టంగా అన్నాడు. "మనుషులు చాలా మారిపోయారు."

"ఒకే.. ఇప్పుడు చీటీలు తెరవండి. హేరీ, డేవ్ చీటీ మీరు తెరవండి," అన్నాడు సమ్మర్స్.

మిస్టర్ గ్రేవ్స్ ఆ చీటీని తెరిచి, పైకెత్తి చూపించాడు. ఖాళీగా ఉన్న దాన్ని చూస్తూనే అందరూ నిట్టూర్చారు. నాన్సీ, బిల్ జూనియర్ కూడా వాళ్ల చీటీలు తెరుస్తూనే, మొహాలు వెలిగిపోతుండగా నవ్వుతూ తమ చీటీలు పైకెత్తి అందరికీ చూపించారు.

"టెస్సీ," అన్నాడు సమ్మర్స్. ఒక్క క్షణం ఆగి బిల్ హచిన్సన్ వంక చూసాడు. బిల్ తన చీటీ తెరిచి చూపించాడు. ఖాళీగా ఉంది అది.

"కాబట్టి, అది టెస్సీ," అన్నాడు సమ్మర్స్ ప్రశాంతంగా. "బిల్, ఆవిడ చీటీ చూపించండి."

బిల్ హచిన్సన్ తన భార్య దగ్గరకి వెళ్లి తన చేతుల్లోనుంచి ఆ కాగితాన్ని దాదాపు లాక్కున్నంత పని చేసాడు. దానిమీద ఒక నల్లటి చుక్క — సమ్మర్స్ అంతకుముందు రోజు రాత్రి తన కోల్ కంపెనీ ఆఫీసుకి చెందిన ఒక నల్లటి పెన్సిల్‌తో చేసిన ఒక నల్లటి చుక్క — ఉంది. బిల్ పైకెత్తి దాన్ని అందరికీ చూపించాడు. అంతటా ఒక కదలిక.

"ఒకే మరి మిత్రుల్లారా," సమ్మర్స్ అన్నాడు. "తొందరగా పూర్తి చేద్దాం."

గ్రామస్తులు ఈ సంప్రదాయపు వివరాలు చాలావరకూ మర్చిపోయినా, నల్లపెట్టె చాలావరకూ మాసిపోయి విరిగిపోయినా, వాళ్లకి రాళ్లు ఉపయోగించాలన్న ఒక్క సంగతి మాత్రం బాగా తెలుసు. ప్రారంభంలోనే పిల్లలు పోగేసిన రాళ్లగుట్ట సిద్ధంగా ఉంది. ఆ ఖాళీ మైదానంలో కూడా రాళ్లున్నాయి. మిసెస్ డెలక్రాయ్ ఓ పెద్ద రాయి ఎంచుకుంది. ఎంత పెద్దదంటే దాన్ని ఆవిడ రెండుచేతులతోనూ ఎత్తిపట్టుకోవాల్సి వచ్చింది. మిసెస్ డన్‌బర్ వంక తిరిగి, "తీసుకో, తొందరగా," అంది.

మిసెస్ డన్‌బర్ చేతిలో చిన్న చిన్న రాళ్లున్నాయి. బరువైన ఉచ్ఛ్వాసనిశ్వాసాల మధ్య అంది, "నేను పరిగెత్తలేను. నువ్వు ముందు వెళ్లు, నేను వెనకగా వస్తాను."

పిల్లల దగ్గర అప్పటికే రాళ్లున్నాయి. చిన్నపిల్లాడు డేవ్ హచిన్సన్‌కి ఒక పిల్లాడు చిన్నచిన్న రాళ్లిచ్చాడు.

మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశంలో టెస్సీ హచిన్సన్ నిలుచుని ఉంది. ఆవిడ చుట్టూ ఉన్న స్థలం నుంచి అందరూ వైదొలగారు. తనవైపు కదిలి వస్తున్న జనాలని చూస్తూ, ఆవిడ చేతులు పైకెత్తి "ఇది న్యాయం కాదు," అంది.

మొదటి రాయి ఆవిడ కణతకి తగిలింది.

"రండి, రండి, అందరూ రండి," అని వార్నర్ అంటున్నాడు. స్టీవ్ ఆడమ్స్ గుంపుకి ముందు ఉన్నాడు. అతని పక్కనే మిసెస్ గ్రేవ్స్ ఉంది.

"ఇది న్యాయం కాదు; ఇది సరికాదు," అని మిసెస్ హచిన్సన్ అరుస్తూ ఉంది.

దాదాపుగా అప్పటికే అందరూ ఆవిడని చుట్టుముట్టేసారు.

★